కుట్రలో భాగమే చంద్రబాబు అరెస్టు

విశాలాంధ్ర-తాడికొండ : ప్రభుత్వ కుట్రలో భాగంగానే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ ఆరోపించారు. అవినీతి ఆరోపణలతో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న నారా చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని కోరుతూ స్థానిక అడ్డరోడ్డు సెంటర్లు టీడీపీ నాయకులు చేస్తున్న దీక్ష సోమవారానికి 13వ రోజుకు చేరింది. అవినీతిపరులంతా వైసీపీలో ఉంటే చంద్రబాబు నాయుడును అరెస్టు చేయటం ఏమిటని నిలదీశారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా కేసుల మీద కేసులను నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్ తదితర విషయాల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయ్..

విశాలాంధ్ర-మంగళగిరి : జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునివ్వడంతో శాంతియుతంగా అసెంబ్లీకి వెళ్తున్న జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావుని నాయకులను కార్యక్రమానికి వెళ్లొద్దంటూ పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేసి అక్రమంగా గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకే తమ అధినేత పవన్ ఆశయం.. ఆ దారిలోనే మేము నడుస్తున్నాము. ప్రజా వ్యతిరేకత విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడి మంచి రోజులు రానున్నాయని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ చేనేత వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతం మధు, రాష్ట్ర కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా

విశాలాంధ్ర-మంగళగిరి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ ధర్నా చౌక్ వెళ్తున్న అంగన్‌వాడీ ఆయాలను, టీచర్లను మంగళగిరి, రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రకాశం, అనంతపురం, పల్నాడు జిల్లాలకు చెందిన 65 మంది అంగన్‌వాడీలను అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిని వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎస్ఎస్ చేంగయ్యా, ఈ.అప్పారావు, పి.బాలకృష్ణ, ఎం.పకీరియా, వై.కమలాకర్, ఎం.భాగ్యరాజు, టి.శ్రీనివా సరావు, షేక్ జానీ భాష, బి.కోటేశ్వరి, ఏ.సామ్ రెడ్డి తదితరులు పరామర్శించి పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని వారు స్పష్టం చేశారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జనసేన నాయకుల ముందస్తు అరెస్ట్

విశాలాంధ్ర-మంగళ గిరి : జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. సదరు నిరసన కార్యక్రమానికి హాజరవుతున్నారన్న సమాచారం నేపథ్యంలో ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ సీనియర్ నాయకులు కంకణాల శంకర్‌ను పోలీసులు సోమవారం ఉదయం ముందస్తు చర్యల్లో భాగంగా హౌస్ అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నోటీసులు అందజేశారు. ప్రజా స్వేచ్ఛకు భంగం కలిగించే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం చట్టరీత్యా నేరమని సదరు నోటీసుల్లో పేర్కొన్నారు. సదరు కార్యక్రమానికి హాజరైతే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని నోటీస్‌లో పేర్కొన్నారు.

స్పందన సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-చేబ్రోలు: స్పందన కార్యక్రమాని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ గోపాల్ కృష్ణ చెప్పారు. స్థానిక కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ముగ్గురు తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. వాటిని పరిష్కరించమని ఆ శాఖ అధికారులకు ఆదేశించామని తహశీల్దార్ పేర్కొన్నారు. అనంతరం మాట్లాడుతూ మండల స్థాయిలోని సమస్యను వెంటనే పరిష్కరించుటకు ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాని కార్యాలయంలో నిర్వహిస్తున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరవుతున్నారని సమస్యలను ప్రజలు ఇక్కడే పరిష్కరించుకోవాలన్నారు.

ఆధారాలు లేకుండా చంద్రబాబుపై కేసు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: కనీస ఆధారాలు లేకుండా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై తప్పుడు కేసులో ఇరికించి జైలులో పెట్టారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ కోవెలమూడి రవీంద్ర అన్నారు. సోమవారం స్థానిక నల్లపాడు రోడ్డు హౌసింగ్ బోర్డు కాలనీ ఆర్చి ఎదురు కోవెలమూడి ఆధ్వర్యంలో 28వ డివిజన్ అధ్యక్షుడు తెల్లగొర్ల అప్పారావు యాదవ్ నేతృత్వంలో రిలే నిరాహారదీక్షలు జరిగాయి. దీక్షలకు సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయించి ఆయన గొప్పతనాన్ని ప్రపంచానికి చూపారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నాబత్తుని జయలక్ష్మీ, సింహాద్రి కనకాచారి, డాక్టర నిమ్మల శేషయ్య, నల్లూరి శ్రీనివాస్, రవికుమార్, షేక్ వలి, యస్.శివ, కే.శివాజీ, కొండలు, ప్రసాద్, వెంకట్ రెడ్డి, చిట్టిబాబు, బ్రహ్మం, మధవ్ రావు, సుధాకర్, దాసరి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

'దీన్ దయాళ్ ఉపాధ్యాయ' జయంతి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక కొత్తపేటలో ఉన్న అహల్య ఐవీఎఫ్ అండ్ నర్సింగ్ హోమ్ ప్రాంగణంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు గుంటూరు తూర్పు-6వ మండల అధ్యక్షులు సురేష్ జైన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన బీజేపీ గుంటూరు తూర్పు ఇన్‌ఛార్జ్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ ఉమా శంకర్ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చేసిన త్యాగాలు...వారి సిద్ధాంతాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ సెల్ కన్వీనర్ మలిశెట్టి పవన్‌కుమార్, దినేష్ జైన్, కైలాష్ జైన్, తల్లం మనోజ్, వేమూరి అనిల్ తదితరులు ఉన్నారు.

జనసేన జిల్లా అధ్యక్షుడి అరెస్టు

విశాలాంధ్ర-తుళ్లూరు : జనసేన పార్టీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావుతో సహా మరి కొంతమంది నాయకులు సోమవారం తుళ్ళూరు మండలంలోని మల్కాపురం జంక్షన్ వద్దకు చేరుకున్నారు. పోలీసులు అప్రమత్తమై వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకొని తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

ఫిర్యాదులను హేతబద్ధంగా పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్పందనలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు నిర్ణీత గడువులోపు హేతుబద్ధంగా పరిష్కరించాలని, ఎటువంటి పరిస్థితుల్లో కూడా బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్, డీఆర్ఓ కే చంద్ర శేఖర రావు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.విజయలక్ష్మీ, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి 223 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన ఫిర్యాదులు తిరిగి రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రీఓపెన్ అయిన 43 పిటీషన్లను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ఏపీ సేవ పోర్టల్ నందు పెండింగ్‌లో ఉన్న 1058 వివిధ సర్వీసులను పరిశీలించి ధృవపత్రాలు జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ యుగంధర్ కుమార్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, పంచాయతీ రాజ్ ఎస్.ఇ గుర్రం బ్రహ్మయ్య, జిల్లా పంచాయతీ అధికారి కేశవ రెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ డా.శ్రావణ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఈ సురేశ్, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, డీఈఓ శైలజ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోంది: వెలుగూరి

విశాలాంధ్ర-గుంటూరు : అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తమ కనీస కోర్కెల సాధన కోసం విజయవాడలో ధర్నా తలపెడితే కార్మిక సంఘాల నాయకులు, అంగన్‌వాడీల నాయకులను వారి ఇళ్ల వద్దనే నిర్బంధించే చర్యలకు పోలీసులు పూనుకోవడం సిగ్గు చేటని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి ఒక ప్రకటనలో అన్నారు. అంగన్‌వాడీల రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌తో సహా వందల మంది కార్మికుల్ని, వారి నాయకుల్ని రైల్వేస్టేషన్‌లో, బస్టాండ్లలో ఎక్కడ దొరికితే అక్కడ పోలీసులు అక్రమంగా అరెస్టులు చేశారని, పోలీసుల దౌర్జన్య కాండలో కొంతమంది కార్యకర్తలు సొమ్మసిల్లి పడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం విజయవాడ నగరాన్ని పోలీస్ నగరంగా మార్చేశారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, అధ్యక్షులు రవీంద్రనాథ్, నాయకులు చలసాని రామారావు, వెంకట సుబ్బయ్య, కొండలరావు, ఇంకా అనేక మంది సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులను బలవంతంగా లాక్కుపోయి అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. ఈ అక్రమ, నిరంకుశ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించాల్సింది పోయి ఈ నిరుపేద కార్మికులపై పోలీసు నిర్బంధకాండకు పూనుకోవటం గర్హనీయమన్నారు. రాష్ట్రంలో నిరంకుశ పోలీసు రాజ్యం నడుస్తుందనే దానికి ఈ నిర్బంధకాండ మరో ఉదాహరణ అన్నారు. ర్యాలీలకు అనుమతి లేదంటారు... సభలు సమావేశాలు జరగనివ్వరు... పోలీస్ అనుమతి లేదనే పేరుతో నోరు నొక్కేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య హక్కులన్నిటిని అణచివేస్తున్నారన్నారు. ధర్నాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు అన్నిటినీ నిషేధిస్తూ ఒక చట్టం తీసుకురాగలిగిన దమ్ము, ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మిక సంఘాల నాయకులతో చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే కార్మికులు ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవని, నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ జాకీర్ హుస్సేన్ నగర్, వినోభా నగర్, శీలంవారి వీధి, బాలజి నగర్, ఎల్.బి.నగర్, లాలాపేట, పట్నం బజార్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేసి ప్రజారోగ్య అధికారులకు, శానిటేషన్ కార్యదర్శులకు తగు ఆదేశాలు జరీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత జాకీర్ హుస్సేన్ నగర్ లో ఈ-ఆటో ద్వారా ఇంటింటి చెత్త సేకరణను నేరుగా పరిశీలించారు. లాలాపేటలో పలు ప్రాంతాల్లో 10 గంటల తర్వాత కూడా చెత్త కుప్పలు ఉండడంపై శానిటరీ ఇన్స్పెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే తొలగించాలని, వాహనాలు అవసరమైతే వెహికిల్ షెడ్ ఏ.ఈ.తో సమన్వయం చేసుకోవాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ మహమూద్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు ఎం.ఐజాక్, డి.ప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్లలో సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మండల కేంద్రమైన ఫిరంగిపురంలో నిర్మించుకున్న జగనన్న లే అవుట్లలో కనీస వసతులు కల్పించాలని లబ్ధిదారులు తహశీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందనలో వినతి పత్రం సోమవారం అందజేశారు. జగనన్న లే అవుట్లలో కొంత మంది కుటుంబాలతో నివాసము ఉంటున్నామని ప్రతి రోజు తమ జీవన విధానానికి రాకపోకలకు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాగు నీరు, వీధి లైట్లు లేక భయాందోళనకు గురవుతున్నామని ఫిర్యాదులో కోరారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తులు లే అవుట్ల వద్ద నిత్యం మద్యం సేవిస్తూ బైక్‌లపై తిరుగుతున్నారని, దొంగతనాలు జరుగుతున్నాయని, వస్తు సామాగ్రి, ముఖ్యంగా సిమెంట్ కట్టలు, ఐరన్, నిర్మించుకున్న ఐదు బోర్లు దొంగిలించుకు పోయారని కూలీ పనులు చేసుకొని కుటుంబాలతో జీవనం సాగిస్తున్న తమకు న్యాయం చేయాలని అధికారులకు విన్నవించుకున్నారు. ఓవర్ బ్రిడ్జి క్రింద నీళ్ళు నిలిచి పోకుండా చూడాలని ఇళ్ల నిర్మాణాలకు కావల్సిన వస్తువులు కొనుగోలు చేసుకొని తెచ్చుకొనేందుకు బాడిగకు ఎవరూ రావడం లేదని తెలియజేశారు. స్పందించిన తహశీల్దార్ జగనన్న లే అవుట్లలో సదుపాయాలు ఏర్పాట్లకు సంబంధించిన అధికారులకు సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. షేక్ బషీర, షేక్ భాషా, వెంకట స్వామి, పి.జోజిమ్మ, బుల్లిబాబు, పి.లక్ష్మి, పి.లూర్దు తదితర బాధితులు పాల్గొన్నారు.

వేస్ట్ పిక్కర్లు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వేస్టు పిక్కర్లు, సంచార జాతుల వారు వివిధ రకాల నైపుణ్యాలను నేర్చుకుని తమ ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేయాలని దళిత బహుజన రిసోర్స్ (డీబీఆర్‌సీ) సెంటర్ ప్రోగ్రామ్ మేనేజర్ చుక్కా శామ్యూల్ అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో స్థానిక అమరావతిరోడ్డులో ఉన్న మదర్‌థెరీస్సా భవన్‌లో 'వేస్ట్ పిక్కర్లు, సంచార జాతులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం' సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వేస్టు పిక్కర్లు మారుతున్న కాలానుగుణంగా తమ నైపుణ్యాలను పెంచుకోవాలని కోరారు. తగిన రక్షణ పరికరాలను ధరించి గాయాల నుంచి.. అనారోగ్యం బారి నుంచి తమను తాము కాపాడుకోవాలని సూచించారు. సామాజిక కార్యకర్త నారాయణ మాట్లాడుతూ వేస్టు పిక్కర్లు తాము సేకరించిన వ్యర్థాలను సమర్థవంతంగా వేరుచేసే నైపుణ్యం నేర్చుకుని ఎక్కువ ఆదాయం సంపాదించుకోవడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మిక్కిలి సురేష్, డీబీఆర్‌సీ ప్రతినిధులు రవితేజ, రాజశేఖర్, మల్లీశ్వరి, వెంకటరావు, స్వాతి ఉన్నారు.

ఘనంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల వార్షికోత్సవం

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు : పారా సంస్థ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల 8వ వార్షికోత్సవం వట్టిచెరుకూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పారా సంస్థ 1986లో రావులపాలెం కేంద్రంగా స్థాపించబడి... పేదల కోసం, మహిళా హక్కుల కోసం, భూమిలేని నిరుపేదల కోసం, దివ్యాంగుల కోసం, బాలల హక్కుల కోసం పనిచేస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 7 జిల్లాల్లోని 280 హైస్కూల్స్, తెలంగాణలో 5 జిల్లాల్లోని 200 హైస్కూల్స్‌లో మొత్తం 480 హైస్కూల్స్‌లోని బాలల హక్కుల కోసం, వారి అభివృద్ధి కోసం జిల్లా విద్యాశాఖాధికారి అనుమతితో పనిచేస్తుందని తెలిపారు. అలాగే రెండు రాష్ట్రాలలోని స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ సహకారంతో 600 గ్రామాలలోని బాలలు ఎదుర్కొనే సమస్యలపై పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వట్టిచెరుకూరు ఎంఈఓ నిర్మల, వట్టిచెరుకూరు హెచ్ఎం రమాదేవి, పారా సంస్థ రాష్ట్ర సలహాదారు, ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ అంగీకరించం : ఫ్యాప్టో

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పాత పెన్షన్ విధానం తప్ప జీపీఎస్‌ని అంగీకరించే ప్రసక్తే లేదని ఫ్యాప్టో నాయకులు స్పష్టం చేశారు. సోమవారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర పిలుపు మేరకు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాత పెన్షన్ అమలు చేయాలనీ కోరుతూ ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో రోడ్ పై బైఠాయించారు. పాదయాత్రలో జగన్ మోహన్ రెడ్డి పాత పెన్షన్ ఇస్తాను అని ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా బలవంతంగా సీపీఎస్ బదులు జీపీఎస్ అమలు చేయాలనీ ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యహితంగా చేస్తున్న నిరసనలను కూడా అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గం అన్నారు. మాట్లాడుతూ అనేక రాష్ట్రాలు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకు వస్తే హామీ ఇచ్చిన ఈ రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్‌ని అమలు చేయకపోవటం మాటతప్పడం మడమ తిప్పడం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం సీపీఎస్ ప్రయత్నాల్ని విరమించుకొని ఓపీఎస్ అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని అన్నారు. అనంతరం కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు. ఫ్యాప్టో నాయకులు జోసెఫ్ సుధీర్ బాబు, ఎం.కళాదర్, తిమ్మన్నబసవ లింగారావు, పార్థసారథి, డి.పెద్దబాబు, బి.ఆదిలక్ష్మి, జి.వేళాంగిణి రాజు, సుబ్బారెడ్డి, ఖలీద్, మేకల సుబ్బారావు, తిరుమలరెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ పాలకవర్గ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పాలకవర్గం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జిల్లా పరిషత్ ఏసీ కార్యాలయంలో జడ్పీ సీఈఓ జె.మోహన్ రావు అధ్యక్షతన సోమవారం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ రెండేళ్ల పాలనలో తనకు సహకరించిన జడ్పీటీసీ సభ్యులకు, జిల్లా పరిషత్ సీఈఓకు, పరిపాలనా అధి కారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా పరిషత్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేయుచున్న 8 మంది ఉద్యోగులకు పరిపాలనా అధికారులుగా పదోన్నతులు కల్పిస్తూ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్‌లు శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, బత్తుల అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీలో 'మామా మశ్చీంద్ర' చిత్రబృందం సందడి

విశాలాంధ్ర-గుంటూరు : సుధీర్ బాబు, ఈషా రెబ్బా, మృనాళిని రవి ప్రధాన పాత్రలలో శ్రీ వెంకటేశ్వరా మూవీస్ ఎల్ఎల్‌పీ పతా కంపై నటుడు హర్షవర్ధన్ రచన, దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మామా మశ్చీంద్ర' చిత్రం అక్టోబర్ 6న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రచారంలో భాగంగా చిత్రబృందం వీవీఐటీ కళాశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో హీరో హీరో సుధీర్ బాబు, డైరెక్టర్ హర్షవర్ధన్ వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. సుధీర్ బాబు మాట్లాడుతూ వైవిధ్యంతో కూడిన కథతో ఈ చిత్రం ఆసక్తి రేపుతుందని, చిత్రంలో మూడు విభిన్నమైన పాత్రలలో తాను త్రిపాత్రాభినయం చేయబోతున్నట్లు తెలిపారు. ఇప్పటికే విడుదలైన టీజర్ చిత్రంపై ఆసక్తి పెంచిందని అన్నారు. విద్యార్థులతో కలిసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

రూ.5.3 లక్షలకు లడ్డు వేలం

విశాలాంధ్ర-తాడేపల్లి : పట్టణ పరిధిలోని వైఎస్సార్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా మధ్యాహ్నం 10 వేల మందికి అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. నిమజ్జనానికి ముందు తాడేపల్లికి చెందిన బంతు లక్ష్మారెడ్డి మనవడు ఋషిత్రెడ్డి ఇచ్చిన 36 కేజీల లడ్డూను వేలంపాట నిర్వహించారు. ఈ లడ్డూను తాడేపల్లికి చెందిన కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, గరుగు శ్రీనివాసరెడ్డిలు రూ.5లక్షల 30 వేలకు పాడారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూ పాట నిర్వహిస్తున్నామని, ఈ పాట ద్వారా వచ్చిన ధనాన్ని నిమజ్జనం రోజున అన్నదాన కార్యక్రమానికి వినియోగిస్తున్నామన్నారు. నిమజ్జన కార్యక్రమంలో కోయడాన్స్ ఆకర్షణీయంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాల్ రెడ్డి, ఈ.డేవిడ్ రాజ్, మేకా వెంకటరామిరెడ్డి, ఎం.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు పదోన్నతి

విశాలాంధ్ర-పొన్నూరు : తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారు(డీటీ)గా విధులు నిర్వహిస్తున్న పి.వాసు తహశీల్దారుగా పదోన్నతి పొందారు. సోమవారం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం వెనిగండ్ల మండలం తహశీల్దార్‌గా పదోన్నతి పొందినట్లుగా తెలిపారు. పదోన్నతి పొందిన వాసును తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్, సిబ్బంది అభినందించారు.

30న 'విశ్వబ్రాహ్మణ శంఖారావం సమైక్యత స్ఫూర్తి దినోత్సవం'

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం లో ఈ నెల 30వ తేదీ విశ్వబ్రాహ్మణ శంఖారావం సమై ఖ్యతా స్ఫూర్తి దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏపీ విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు పావులూరి హనుమంతరావు తెలిపారు. సోమవారం స్థానిక బ్రాహ్మణ సేవా సమాజం కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018లో 60 వేల మందితో బ్రహ్మంగారి మఠంలో విశ్వబ్రాహ్మణ శంఖారావాన్ని పూరించిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా ఈ పండుగ నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ పంచ వృత్తుల ప్రదర్శన, బొబ్బిలి వీణలు, ఏటికొప్పాక బొమ్మలు, శ్రీకాళహస్తి బొమ్మలు ఇతర విశ్వకర్మియుల ప్రతిభకు సంబంధించి ప్రదర్శనలు ఉంటాయని తెలియజేశారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా శంఖారావం సభ ద్వారా ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు దృష్టికి తీసుకువెళ్లేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. 26 జిల్లాల నుండి విశ్వబ్రాహ్మణ జిల్లా కమిటీలు కూడా పెద్ద ఎత్తున పాల్గొంటారని కొన్ని జిల్లాలలో జిల్లా కమిటీలలో ఏర్పడిన ఖాళీలకు ఈ సమావేశంలో నిర్ణయం తీసుకొని విస్తృతస్థాయి సమావేశం నిర్ణయం మేరకు కమిటీల ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలియజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొలగాని నందవీరప్రసాద్, జిల్లా అధ్యక్షులు అద్దంకి భద్రయ్య, మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరి ముంజంపల్లి నాగ రాజకుమారి, వెంకటరమణ, కోంకిపూడి కోటేశ్వరరావు, సిద్ధాంతి నాగమల్లేశ్వరావు, హనుమంతరావు, మోహనరావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

అవయవదానానికి కృషి చేయండి

విశాలాంధ్ర-గుంటూరు : విద్యార్థులందరూ అవయవ దానంపై అందరికీ అవగాహన కల్పించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ ఫార్మాసిస్ట్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం ఫార్మాసిస్ట్ డే వేడుకలను 'ఫార్మాసిస్ట్స్ స్ట్రెంగ్తనింగ్ హెల్త్ సిస్టమ్స్ అంగదాన్ మహాదాన్' అనే ఇతివృత్తంతో నిర్వహించాలని ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫార్మసిస్ట్స్ పిలుపునిచ్చింది. విజ్ఞాన్స్ యూనివర్సిటీ దత్త గ్రామమైన వేజెండ్లలో అవయవదానం గురించి అవగాహన కల్పిస్తూ ర్యాలీతో పాటు కంటి శిబిరాన్ని కూడా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వై.కిరణ్ కుమార్ మాట్లాడుతూ లివర్, కిడ్నీ వంటి అవయవాల దానం కోసం చాలా మంది రోగులు ఎదురుచూస్తున్నారన్నారు. ఫార్మాసిస్ట్‌లు రోగులకు ఉత్తమ వైద్యాన్ని అందించాలన్నారు. ఫార్మసీ నోబుల్ ప్రొఫెషన్ అని కొనియాడారు. ఫార్మసీ విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించి, కొత్తగా పుట్టుకొస్తున్న రోగాలకు సరికొత్త మందులను కనుగొనాలన్నారు. వైద్య, ఔషధ రంగాల తయారీలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమైనదని అన్నారు. అనంతరం పలు పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు రైతులకే పంట రుణాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-దుగ్గిరాల : కౌలు రైతులను అన్ని విధాల ఆదుకుంటున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు విమర్శించారు. గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 27న జిల్లా లీడ్ బ్యాంకు వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని దుగ్గిరాల మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 70 శాతం భూమిని కౌలు రైతులు సాగు చేస్తుండగా కేవలం రూ.20 కోట్ల పంట రుణాలు ఇవ్వడం సిగ్గుచేటని ఆయన ఘాటుగా విమర్శించారు. భూయజమాని అంగీకారంతోనే సీసీఆర్సీ కార్డులు కౌలు రైతులు పొందుతున్నప్పటికీ వారికి పంట రుణాలు ఇవ్వకుండా బ్యాంకులు సవాలక్ష అదనపు నిబంధనలను విధిస్తున్నా ప్రభుత్వం మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పంట రుణాలు కౌలు రైతులకు ఇవ్వకపోతే కౌలు రైతులను కూడగట్టి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మన్నవ నాగమల్లేశ్వరరావు, భీమవరపు అమ్మిరెడ్డి, మాతంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫార్మాశిస్టల దినోత్సవం

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ప్రపంచ ఫార్మాశిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక దీనాపూర్ ప్రాంగణంలో గల సెయింట్ జేవియర్ ఫార్మాశిస్ట్ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన డా.నిశాంత్ మాట్లాడుతూ 1960లో భారత దేశంలో మానవుని జీవిత కాలం 40 సంవత్సరాలు ఉండేదని, ఫార్మాశిస్ట్‌లు చేసిన విలువైన పరిశోధనలతో నాణ్యమందులు తయారు చేయడం ద్వారా కొత్త మందులు ఫార్మాశిస్ట్‌లు కనుగొనుట కారణంగా నేడు మానవుని జీవిత కాలం 80సంవత్సరాలకు పెరిగిందని గుర్తు చేశారు. దేశంలో మానవునికి కావల్సిన వివిధ రకాల నాణ్యమైన కొత్త మందులు తయారీకి ఫార్మాశిస్ట్‌లకే సాధ్యమని తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్-19 మరణాలతో స్థంభించి పోయినపుడు దానికి తగిన వ్యాక్సిన్ కనుగొన్న ఘనత ఫార్మాశిస్ట్‌లదేనని వివరించారు. కార్యక్రమంలో ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డా.జీవన్ మణిబాబు, డా.మెర్సీ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాషువకు గుంటూరు కవుల నివాళి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మహాకవి గుర్రం జాషువ జయంతి వారోత్సవాలలో భాగంగా స్థానిక మార్కెట్ సెంటర్‌లో గల హిందూ కాలేజీలోని ఆడిటోరియం నందు జాషువ కళాపీఠం ఆధ్వర్యంలో 'మహాకవి జాషువకు గుంటూరు కవుల నివాళి' అనే అంశంపై సోమవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కళాపీఠం కార్యదర్శి నూతక్కి సతీష్ ముఖ్య అతిథులను సభకు పరిచయం చేశారు. అభ్యుదయ రచయిత సంఘం (అరసం)జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీ నారాయణ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ మహాకవి జాషువ సాహిత్యంలో 'మహిళా ప్రాధాన్యత' అంశంపై వివరణాత్మక ప్రసంగం చేశారు. అనంతరం జాషువ కళాపీఠం అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ జాషువ సాహిత్యాన్ని సమాజంలోని ప్రజా బాహుళ్యంలో ప్రాచుర్యం చేసేందుకు తమ కళాపీఠం ప్రతి సంవత్సరం జాషువ జయంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు శాఖ ప్రచానాచార్యులు ఎల్లాప్రగడ మల్లికార్జునరావు మాట్లాడుతూ జాషువ సాహిత్యాన్ని విద్యార్థులు చదవడం ఎంతో అవసరమన్నారు. కవి కొమ్మవరపు విన్సన్‌రావు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అత్తోట జోసెఫ్ వందన సమర్పణ చేశారు.

కిరాతకులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : చిత్తూరు జిల్లా పెనుమూరు మండ లంలో వడియరాజుల కులానికి చెందిన భవ్యశ్రీని అత్యాచారం చేసి బావిలో వేసిన కిరాతకులను కఠి నంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇంటర్మీడియట్ చదువుతున్న భవ్యశ్రీని ప్రేమించానని నమ్మబలికి తీసుకెళ్లి నలుగురు స్నేహితు లతో అత్యాచారం చేసి చంపారని, ఆనవాళ్లు కనపడకుండా జుట్టు కత్తిరించి బావిలో పడేశారని అన్నారు. ఈ ఘటనకు పాల్పడిన నరరూప రాక్షసులను నడిరోడ్డులో ఉరితీయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనకు కారకులైన వారిని అరెస్ట్ చేసేంత వరకు తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనం

విశాలాంధ్ర-తాడేపల్లి : మహానాడు 24 రోడ్డులో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనం కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. గణేష్ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకవెళ్లి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు టి.రాజ మోహన్, వి.రామచంద్ర, ఎస్.రవి, ఎం.నాగేంద్రరెడ్డి, జె.కోటి, టి.శ్రీను, సాయి, ఎం.పండు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, నాంపల్లి, సుప్రీమ్ ఎస్టేట్, డోరు నెం.11-3-847రు, ఫ్లాట్ నెం. 201రు కాపురస్తులు లేటు షేక్ మౌలా అలి గారి కుమారుడు షేక్ బాషా (సెల్: 93941 55522) అను నేను గుంటూరు సిటీ, రైలుపేట నందలి 90 చ.గ.ల నందలి ఏసిసి ఇంటి యొక్క ఒరిజినల్ దఖలు దస్తావేజును తీసుకుని ది.19-09-2023న మాచవరంలోని నాకు పరిచయస్తుడైన షేక్ అన్వర్ ఇంటికి వెళ్లినాను. అక్కడ సదరు దస్తావేజు జిరాక్సు అవసరమైన సమీపంలోని మండపాల సెంటర్‌కు ఫొటోస్టాట్ నిమిత్తం వెళ్లుచుండగా మార్గమధ్యలో పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల నాకు తెలియజేయగలరు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-శావల్యాపురం : రాష్ట్ర స్థాయి బాల్ బ్యాట్మింటన్ పోటీలకు శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయిని బొడ్డపాటి విజయలక్ష్మి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు పాఠశాలలో సోమవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హెచ్ఎం మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ఎంపిక కావటం ఆనందంగా ఉందని, అలాగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపిక పోటీలు ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షులు ఆనంద్ ప్రభాకర్, కార్యదర్శి శివశంకర్ పర్యవేక్షణలో ఈ నెల 24వ తేదీన గుంటూరు ఎన్జీవో కాలనీలోని హెూమ్ గ్రౌండ్‌లో నిర్వహించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 30వ తేది నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నంద్యాల జిల్లా మహానందిలో జరిగే 8వ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాట్మింటన్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను విద్యా కమిటీ చైర్మన్ ముట్లూరి ప్రసాదు, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, బీవీ నాగేశ్వరరావు, సుబాష్ చంద్రారెడ్డి, హనిమిరెడ్డి, గురుబాబు, అబ్దుల్లా, సురేష్, భువనేశ్వరి, నిర్మల, రవి, విమల కుమారి, శ్రీను, శ్రీకాంత్ అభినందించారు.

విప్పర్లపల్లిలో స్వచ్ఛ హీ భారత్ అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలోని విప్పర్లపల్లి గ్రామంలో సోమవారం స్వచ్ఛ హీ భారత్ అవగాహన ర్యాలీ జరిగింది. గ్రామంలో అన్ని వీధులలో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు పరిశుభ్రత గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ గాదె రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి వచ్చే నెల 2 మహాత్మా గాంధీ జయంతి రోజు వరకు స్వచ్ఛ హీ భారత్ అవగాహన కార్యక్రమం జరుగుతుందని అన్నారు. గ్రామస్తులు తమ ఇళ్ళతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్బీ మండల కో-ఆర్డినేటర్ మేడికొండ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు సరికొండ కొండమరాజు, గ్రామ కార్యదర్శి ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాటి శతక జయంతి పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-దుర్గి : గుంటూరు బృందావన్ గార్డెన్స్ కమ్మ జన సేవాసమితిలో తెలుగు వేదకవి శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వ రావు శతక శంఖారావంలో భాగంగా పల్నాటి శతకం ఆవిష్కరణ సభ అమెరికా తెలుగు దిగ్గజం డాక్టర్ ప్రసాద్ తోటకూర ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమా నికి పల్నాడు జిల్లా, దుర్గి మండలం, దుర్గికి చెందిన నాగార్జున కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ సొసైటీ శిల్ప కళాశాల నిర్వహకులు చెన్నుపాటి శ్రీనివాసాచారిని ఆహ్వానించి పల్నాటి శతక జయంతి పుస్తకావిష్కరణ చేయించారు. అనంతరం తానా పూర్వాధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ శిల్పి శ్రీనివాసాచారిని సన్మానించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర-యద్దనపూడి : లూథరన్ ఉన్నత పాఠశాలలో 1977వ సంవత్సరం 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 46 సంవత్సరాల అనంతరం కలుసుకున్న 30 మంది విద్యార్థులు మధురానుభూతికి లోనయ్యారు. కొందరు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. అప్పటికి ఇప్పటికి ఓకే విధమైన చొరవ, స్నేహ భావనలతో సంతసించారు. వివిధ హోదాలలో ఉన్నవారు, రిటైర్ అయిన, కాబోతున్న వారు, అప్పటి నుంచి వ్యవసాయ రంగంలోనే ఉన్న వారు, పరస్పరం ఆత్మీయతను వ్యక్తంచేశారు. విద్యార్థి దశ నుంచి తాతల దశకు చేరుకున్న తాము 50 వసంతాల అనంతరం ఇలా మళ్లీ కలుస్తామని ఊహించలేదని సంతోషం వ్యక్తంచేశారు. ఇటువంటి కలయికతో తాము వృద్ధాప్యాన్ని మరిచిపోయి నూతనోత్సాహాన్ని పొందామని, క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుందామని తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగండ్ల శేషగిరిరావు, పి.బెంజిమన్, వైబీవీ శ్రీనివాసరావు, వి.రాజరాజేశ్వరి, చాగంటి శివకోటిరెడ్డి, ఎం.ఆంజనేయులు, సాల్మన్ రాజు, ఎం.రాధాకృష్ణ, పావులూరి ఉమామహేశ్వరరి, మజుందార్ శేషగిరి రావు, భారతుల పద్మావతి, ఉన్నవ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-మాచర్ల : భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా, శ్రీ సత్యసాయి సేవాసమితి విద్యా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు సేవాసమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. తద్వారా మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక విద్యతో పాటు, మానవతా విలువలు విద్యార్థులలో పెంపొందించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పట్టణంలోని ఆయా విద్యా సంస్థల నిర్వాహకులు వ్యాసరచన పోటీలలో మరింత మంది విద్యార్థులు పాల్గొనేలా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సత్య సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ అక్కినేని అనీల్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విశాలాంధ్ర-యద్దనపూడి : ద్విచక్ర వాహనంపై వెళుతూ స్కిడ్ అయి గాయాలకు గురైన వ్యక్తి మృతిచెందాడు. యద్దనపూడి మండలం మైదవోలు గ్రామానికి చెందిన దావల ప్రసన్నకుమార్ తన తండ్రి నరసయ్య(70) మృతికి సంబంధించి యద్దనపూడి పోలీసులకు ఇచ్చిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 11న ప్రత్తిపాడు గ్రామంలో బంధువులకు చెందిన గృహప్రవేశ కార్యక్రమంనకు టీవీఎస్ ఎక్సల్ ద్విచక్ర వాహనంపై వెళుతూ స్కిడ్ అయి క్రింద పడి గాయాల పాలైన నరస్యకు మైదవోలు గ్రామంలోని ఆర్ఎంపీ వద్ద ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించనట్లు, చికిత్స పొందుతూ 24వ తేదీ రాత్రి మరణించినట్లు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు అక్కడి ఔట్ పోస్ట్ వారికి కూడా తెలియచేశానని పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జెట్టిపాలెంలో బాలిక మృతి

విశాలాంధ్ర-రెంటచింతల : మండలంలోని జెట్టిపాలెంకు చెందిన ఓ బాలిక సోమవారం మృతి చెందింది. స్థానిక ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పుట్టి స్మృతి రెండు రోజులుగా వాంతులు, తలనొప్పితో ఇబ్బంది పడుతుంది. సోమవారం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేట తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు పీహెచ్‌సీ వైద్యులు నర్రా కృష్ణారెడ్డి వెల్లడించారు. నరాల సంబంధిత వ్యాధితో చనిపోయినట్లుగా భావిస్తున్నట్లు వివరించారు. స్మృతి మృతితో తల్లిదండ్రులు చిన లింగయ్య-లింగేశ్వరి, సోదరుడు మహేష్ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

వైసీపీని తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ వినుకొండ పట్టణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం నియోజక వర్గ తెలుగు రైతు కమిటీ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైసిపి ప్రభుత్వాన్ని తిరస్కరిస్తున్నారని, చంద్రబాబు చేసిన సేవలను కొనియాడుతున్నారని పేర్కొన్నారు. సాక్ష్య ధారాలు లేకుండా ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా చంద్రబాబుకు జైలుకు పంపారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కష్టపడ్డ నాయకుణ్ణి అన్యాయంగా జైల్లో పెట్టారని, 43 వేల కోట్లు అవినీతి చేసి ఏ1 ముద్దాయిగా ఉన్న జగన్ మోహ రెడ్డి పాలకుడు అయ్యి నీతిమంతులు జైల్లో ఉండవలసి వచ్చిందన్నారు. రాష్ట్రానికి పట్టిన శని జగన్ అని ప్రజలందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రపంచం మొత్తం చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తున్నారన్నారు. చంద్రబాబుపై వైసీపీ చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రతి ఒక్కరూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు ఇచ్చి బాబుపై పెట్టిన తప్పుడు కేసులను తెలియజేయాలని జీవీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు గోపాల శివయ్య, రాష్ట్ర తెలుగురైతు టిడిపి అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు, వంకాయల పాటి పేరయ్య, లగడపాటి వెంకటరావు, బచ్చు అంజిరెడ్డి, సోమేపల్లి బ్రహ్మయ్య, మక్కెన కొండలు, గోరంట్ల హనుమంతరావు, గన్నమనేనీ వెంకయ్య, యరబిక్కి వెంకటరావు, రొడ్డా వీరాంజనేయ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, ఉప్పలపాడు అంజిరెడ్డి, పల్లమీసాల దాసయ్య, మాదినేని ఆంజనేయులు, గద్దె వీరమస్తాన్ రావు, సోమేపల్లి శ్రీను, బొట్ల అంజయ్య, ముత్తినేని ఏడుకొండలు, కర్నాటి వెంకటరెడ్డి, బెల్లంకొండ సైదులు, కాటం వెంకట కోటేశ్వర రావు, రావూరి నారాయణ, దొడ్డ ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వరరావు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా కె.కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎస్టీయూ పల్నాడు జిల్లా కార్యవర్గ సమావేశం పిడుగురాళ్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావును రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారు. కె.కోటేశ్వరరావు కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ హైస్కూల్ గణపవరంలో స్కూల్ అసిస్టెంట్ సోషల్‌గా పనిచేస్తున్నారు. గత 34 యేళ్లుగా ఎస్టీయూలో మండల శాఖ అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా, జిల్లా సంఘంలో జిల్లా గౌరవాధ్యక్షుడుగా, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర పీఆర్సీ కమిటీ కన్వీనర్‌గా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేశారు. ఉపాధ్యాయ సమస్యల పట్ల పూర్తి అవగాహనతో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్‌లు దగ్గర నుంచి అన్ని రకాల బిల్స్ ప్రిపరేషన్‌లో సహకారం అందిస్తూ ఉపా ధ్యాయ సర్వీసు నిబంధనల గురించిన అవగాహనతో ఇన్‌కమ్ టాక్స్ అన్ని విషయాలలో సహకారం అందిస్తూ నిరంతరం ఉపాధ్యాయుల విద్యారంగ సేవ చేస్తున్నారు. వీరు గుంటూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. వీరి నియామకం పట్ల ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.శారద, సీనియర్ నాయకులు చావలి మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు మేకల కోటేశ్వరరావు, కార్యదర్శి షేక్ జామీర్ భాష, చిలకలూరిపేట మండల ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, నాదెండ్ల మండల అధ్యక్షులు ఎం.ప్రసన్న కుమార్, కార్యదర్శి ఎం.సుందరరావు, షేక్ మక్బుల్ బాషా, ప్రాంతీయ శాఖల ఎస్టీయూ నాయకులు, ఉసా సుబ్బారావు, కాలేషా, రాజేష్ హర్షం వ్యక్తంచేశారు.

జీపీఎస్ ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సీపీఎస్ రద్దు చేస్తామని ప్రకటించి ఇప్పుడు జీపిఎస్ అనే కొత్త విధానాన్ని అమలు చేయటాన్ని నిరశిస్తూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు సోమవారం పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇప్పుడు అసెంబ్లీలో జీపిఎస్ విధానాన్ని అమలు చేస్తామని బిల్లు పెట్టడాన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఈ బిల్లును ఉపసంహరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో అధ్యక్షులు సంపత్ బాబు, బైగ్, సీఎం దాసు, విజయ్ సారధి, సుభాని, మక్కిన శ్రీనివాసరావు, యుటిఎఫ్ అధ్యక్షులు పి ప్రేమ్ కుమార్, ఎస్ టి యు నాయకులు సుభాని, శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ నాయకులు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-నరసరావుపేట: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆ పార్టీ శ్రేణులు తలపెట్టిన ఆందోళనలు సోమవారం 13వ రోజు కూడా కొనసాగాయి. ప్రతి రోజు వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్నారు. నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదల వాడ అరవింద బాబు ఆధ్వర్యంలో క్లస్టర్ ఇంచార్జ్ ఇమిడిశెట్టి కాశయ్య సారధ్యంలో రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చదలవాడ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, దాన్ని పక్కదారి పట్టించేందుకే చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేశారని ఆరోపించారు. దేవుడి దయ, ప్రజల ఆశీస్సులతో చంద్రబాబు త్వరలోనే జైలు నుంచి బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. టీడీపీ నాయకులు వేములపల్లి వెంకట నరసయ్య, కొల్లి బ్రహ్మయ్య, పులిమి వెంకట రామిరెడ్డి, వాసిరెడ్డి రవి, కొట్ట కిరణ్, కొల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు

విశాలాంధ్ర-రెంటచింతల : పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, ప్రభుత్వ తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. మండల కేంద్రమైన రెంటచింతలలోని రేగుల మాన్యంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక గిరిజన సంక్షేమ శాఖ పాఠశాల, అంబేద్కర్ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మౌలిక వసతులతో పాటు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండి మెరుగైన బోధన అందిస్తున్నారా లేదా అని ఆమె అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీసి, వంటలను పరిశీలించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతోపాటు, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దటానికి ప్రభుత్వం కేటాయించిన విధంగా మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రతతో ఉండటంతో సంతృప్తి చెందిన ఎంపీపీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏకైక ఉపాధ్యాయుడు కొమరగిరి రమేష్‌ను అభినందించారు. ఎంపీపీ వెంట ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలో దివ్యాంగులు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా సోమవారం పట్టణంలోని కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దివ్యాంగులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర దివ్యాంగుల సంస్థ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ అక్రమ కేసుల్లో ఇరికించి చంద్రబాబు నాయుడుకు జైలు శిక్ష వేశారని, దానికి ప్రతిఫలంగా రాబోయే రోజుల్లో ప్రజలు జగన్‌కి ఎన్నికల్లో ఉరిశిక్ష వేస్తారన్నారు. సాక్షాత్తు తాడికొండ ఎమ్మెల్యే శ్రీదేవి తనికి జగన్ ప్రభుత్వంలో ప్రాణహాని ఉందని చెపుతుంటే ప్రభుత్వ పాలన ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. రానున్న కాలంలో మనమందరం చంద్రబాబుకి అండగా ఉండాలని కోరారు. నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగులు దీక్షలో పాల్గొన్నారు.

సీపీఐ అధ్వర్యంలో సీఎంకు పోస్ట్ కార్డులు

విశాలాంధ్ర-వినుకొండ: సంక్షేమ పథకాల అమలు కోసం సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో వినుకొండ మండలం కొండ క్రింద ఉప్పరపాలెం గ్రామ ప్రజల చేత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి పోస్ట్ కార్డుల ద్వారా అర్జీలు పంపారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్ నేను అధికారంలోకి రాగానే అర్హులైన పేదలందరికీ నవరత్నాలు పథకాలు ద్వారా అమ్మఒడి, చేయూత లాంటి పథకాల ద్వారా పేదలందరికీ మేలు చేస్తానని, రాష్ట్రంలో ఇళ్లులేని పేదలకు స్థలాలిచ్చి ఇల్లు కట్టించి అన్ని సౌకర్యాలు కల్పించి అందజేస్తానని పలు హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలు విస్మరించారని, అలాగే ఎవరికైనా పొరపాటున ఇంటి స్థలం రాక ఇబ్బందులు పడుతుంటే సచివాలయంలో అర్జీలు పెట్టుకుంటే 90 రోజులు ఇంటి స్థలం ఇస్తానని చెప్పారు. కానీ వినుకొండ మండలం కొండ కింద ఉప్పరపాలెంలో ఇల్లు లేకుండా సుమారుగా 300 కుటుంబాలు రెండు సంవత్సరాల నుంచి గ్రామసచివాలయం, ఎమ్మార్వో కార్యాలయం, కలెక్టర్ ఆఫీసు చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయారని, ఎవ్వరూ పట్టించుకున్న నాధుడే లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అందుకే స్వయంగా సీఎం జగన్మోహన్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా వారి సమస్యలను తెలియజేస్తున్నామని, సీఎం వెంటనే స్పందించి ఉప్పరపాలెం పేదలందరికీ పక్కా గృహాలు, అమ్మ ఒడి, చేయూత లాంటి పథకాలు అందజేయాలని బూదాల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పరపాలెం మహిళలు దుర్గమ్మ, రమణమ్మ, సరోజమ్మ, మల్లేశ్వరి, కనకమ్మ, సుజాత, దేవి, సిపిఐ నాయకులు కొప్పరపు మల్లికార్జున, ఎస్కే మస్తాన్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో సోమవారం వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ప్రసంగించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. బొల్లాపల్లి మండలంలో కొన్ని గ్రామాలు భూగర్భ జలాలు అడుగంటిన జాబితాలో ఉండి, సరైన నీటి సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి బొల్లాపల్లి చెరువు ఆధునీకరణ చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, ఈ చెరువు ఆధునీకరణకు, ఆ చెరువు నుంచి నీటిని సరఫరాకు గ్రామాలకి పైపు లైన్లు వేయడానికి అవసరమైన అటవీ అనుమతులు చివరి దశలో ఉన్నాయని, త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా వినుకొండ నియోజకవర్గానికి 100 పడకల హాస్పటల్ నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చాయని, త్వరలోనే శంకుస్థాపన చేయబోతున్నామని, ముస్లిం గురుకుల పాఠశాల, కాలేజీ సంబంధించిన అన్ని అనుమతులను త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రులను ఆయన కోరారు.

స్పందనకు ఫిర్యాదుల వెల్లువ

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలో స్పందన కార్యక్రమం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. స్పందన కార్యక్రమానికి పలు మండలాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, పులిచింతల ప్రత్యేక అధికారి వసంత బాబు, పుడా అధికారి శ్రీనివాసరెడ్డి లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 302 అర్జీలును స్వీకరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఇతర అధికారులు వచ్చిన అర్జీలు సంబంధిత అధికారులకు పంపి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి : ఎస్పీ

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో బాధితులనుండి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లాలోని పోలీసు అధికారులకు ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశించారు. ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు ఆయా సమస్యలకు సంబంధించి ఎస్పీకి పలువురు ఫిర్యాదులు చేశారు. జొన్నలగడ్డ గ్రామం నరసరావుపేట మండలంనకు చెందిన చట్టు బ్రహ్మం తన పొలంలో మొక్కజొన్న పంట వేయగా ప్రక్కనే పొలం వ్యక్తి జొన్న పంటను ట్రాక్టర్ తో దున్ని నాశనం చేశాడని సదరు వ్యక్తి పైన చర్య తీసుకోని తగిన న్యాయం చేయమని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రాజుపాలెం మండలంనకు చెందిన ఈపూరి వెంకటేశ్వరు తన ఇద్దరి మగ పిల్లలకు పొలం సమానంగా పంచి ఇచ్చి అతను కొంత పొలం ఉంచుకున్నట్లు అయితే ఆ పిల్లలిద్దరూ ఫిర్యాది పొలానికి నీళ్లు ఇవ్వకుండా బయటి వాళ్లకి ఇస్తూ ఫిర్యాదిని ఇబ్బంది పెడుతున్నారని వారిని పిలిపించి పొలానికి నీళ్లు ఇప్పించాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఎస్పీ రవిశంకర్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి(అడ్మిన్) ఆర్. రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పి డి రామచంద్ర రాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్.కె చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి మహేష్, పల్లపు రాజు, బి ఆదినారాయణ, యు.రవిచంద్ర, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సైకో పాలనకు అంతిమ ఘడియలు: మునగోటి

విశాలాంధ్ర-పెదకూరపాడు : సైకో వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డి పాలనకు అంతిమ ఘడియలు వచ్చాయని పెద కూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహ న్‌రెడ్డికి గుణపాఠం చెప్పడానికి రాష్ట్ర ప్రజలు కంకణ బద్దులై ఉన్నారని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబుపై అక్రమ అరెస్టుకు నిరసనగా కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ డైరెక్టర్ నెలకుదుటి వరప్రసాద్ ఇంటి దగ్గర చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు శ్రీనివాసరావు సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ 14 సంవత్సరాలు సీఎంగా ఉన్న చంద్రబాబుపై తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేయటం దుర్మార్గమని దుయ్యబట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి, పైశాచికత్వానికి పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఒక గొప్ప దాక్షనికుడిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆంధ్ర రాష్ట్రమే కాకుండా యావత్ ప్రపంచం ఖండిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల అండదండలతో రానున్న ఎన్నికలలో ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. అనంతరం నేలగుదుటి వరప్రసాద్ (బుజ్జి) మాట్లాడుతూ ఈనాటి వైకాపా ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని, ప్రజల పక్షాన మాట్లాడే ప్రతిపక్ష, వామపక్ష నేతలుపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నిం చారు. పోలీసులను అడ్డం పెట్టుకుని రాజారెడ్డి రాజ్యాం గాన్ని అమలు చేస్తున్నారని, ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు వట్టిగుంట శివరామ కృష్ణయ్య, గుంటుపల్లి కోటేశ్వరరావు, చెన్ను పాటి బుల్లిబాబు, మాజీ వైస్ ఎంపీపీ చెన్నుపాటి సుధా రాణి, నాదెండ్ల కల్పన, సరళ, వెంకట్రావమ్మ, తూమాటి నాగమల్లేశ్వరి, కర్ణాటక మల్లేశ్వరి, శేషమ్మ, నెట్టెం రమాదేవి, చుండు సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ఆమోదం: ఎంపీ

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడులోని రొంపిచర్ల, మాచర్లలో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. దేశ వ్యాప్తంగా కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించి కేంద్రం సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 8 కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటుకి ఆమోదం లభించగా.. ఇందులో రొంపిచర్లలో, మాచర్లలోని తాళ్లపల్లి గ్రామంలో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకి కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి కూడా లభించిందని చెప్పారు. ఇప్పటి వరకు నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో సత్తెనపల్లి, చిలకలూరిపేటల్లో కేంద్రీయ విద్యాలయాలు కొనసాగుతుండగా.. ఇప్పుడు రొంపిచర్ల, మాచర్లలో కొత్తగా ఈ విద్యాలయాలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. పల్నాడులోని 7 నియోజకవర్గాల్లో కేంద్రీయ విద్యాలయాలు అందుబాటులో ఉండాలన్నదే తమ సంకల్పమని ఎంపీ తెలిపారు. ఈ కేంద్రీయ విద్యాలయాలు అందుబాటులోకి వస్తే పల్నాటి విద్యార్థులకు విద్యా సదుపాయాలు మెరుగుపడతాయని చెప్పారు.

టీడీపీ నిరసనకు సీపీఐ సంఘీభావం

విశాలాంధ్ర-మాచర్ల : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్ట్ అక్రమం అంటూ ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మౌన దీక్షకు సీపీఐ పట్టణ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమేనని, కానీ అరెస్ట్ చేసే విధానం రాజ్యాంగ వ్యవస్థకు లోబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కుర్రి శివారెడ్డి, షేక్ అన్వార్, కడియం కిషోర్, మంజుల వెంకటేశ్వర్లు, వజ్రం నాయక్, బాబు ఖాన్, నేరేటి వీరాస్వామి, సీపీఐ నాయకులు వెనగంటి చిన్న రామయోగి, కొనపర్తి బ్రహ్మాచారి, కందుకూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకులకు నోటీసులు

విశాలాంధ్ర-గురజాల : జనసేన పార్టీ జిల్లా నేతల ఆధ్వర్యంలో తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కటికం అంకారావుకు పోలీసులు నోటీసు జారిచేసి హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అంకారావు మాట్లాడుతూ అక్రమంగా జరుగుతున్న ఇసుక త్రవ్వకాలపై, శాంతియుతంగా నిరసన తెలియజేసేందుకు చలో అసెంబ్లీకి జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరావు పిలుపునిస్తే పోలీసులు జనసేన నేతలను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్ట్‌లు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. గతంలో ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్జీటిపై కోర్టు తీర్పును కూడా లెక్కచేయకుండా అక్రమంగా ఇసుకని తరలిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్దంగా శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కు కూడా లేకుండా పోయిందన్నారు. రానున్న ఎన్నికలలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు అర్థం అయ్యేలా వివరించి వైసీపీని గద్దె దించేందుకు కృషి చేయాలన్నారు.

నీటి తీరువా త్వరితగతిన వసూలు చేయాలి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : నీటి తీరువా వసూళ్లను త్వరితగతిన వసూలు చేయాలని తహశీల్దార్ నగేష్ అధికారులకు ఆదేశించారు. సత్తెనపల్లి మండల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులతో తహశీల్దార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీటి తీరువా వసూళ్లు..ఈ క్రాప్ బుకింగ్..ఆధార్ సీడింగ్ టు పట్టాదారు పాస్‌బుక్‌ల మార్పులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రీ సర్వే కోసం రైతుల డాక్యుమెంట్లు సేకరించాలన్నారు.

ఘనంగా నేషనల్ ఫార్మసిస్ట్ డే

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో హాస్పటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నేషనల్ ఫార్మసిస్ట్ డే ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శాలువాలతో ఫార్మసిస్టులందరినీ ఘనంగా సన్మానించారు. హాస్పటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ హాస్పిటల్‌కి ఫార్మసిస్టులు ఒక మూల స్తంభం లాంటివారని, వారి సేవలు అమితమైనవని అన్నారు. హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మణరావు మాట్లాడుతూ హాస్పిటల్ అభివృద్ధిలోనే కాక హాస్పటల్‌లో పని చేసే ప్రతి ఒక్కరికి గౌరవప్రదమైన స్థానం కల్పిస్తున్నారని అన్నారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్, మెడికల్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, గైనకాలజిస్ట్ సుజాత, ఏఓ భవాని, ఫార్మసిస్టులు విజయలక్ష్మి, పద్మావతి, కుమారి పాల్గొన్నారు.

కల్నాటి కోటేశ్వరరావుకు నివాళి

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని ధరణికోట గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కల్నాటి కోటేశ్వరరావు సంస్మరణ సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్, వెన్నా సాంబశివ రెడ్డి, పఠాన్ నూర్జహాన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు

బహిరంగ వేలం ప్రకటన
మహారాజశ్రీ వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఇ.పి.నెం. 32/2022 ఇన్
ఓ.యస్. నెం. 83/2021

అనుకు వెంకటేశ్వర్లు తండ్రి **లక్ష్మయ్య,** వయస్సు 33 సం॥లు, కరెంటు ఆపరేటర్ ఇన్ ఎ.పి.సి.పి. డి.సి.యల్, డోర్ నెం. 1-115ఎ, రావులాపురం గ్రామం, బొల్లాపల్లి మండలం, పల్నాడు జిల్లా. ..డి.హెచ్. ఆర్/ వాది

ఎదరి

యలగాల పెద బ్రహ్మయ్య తండ్రి ఆదెయ్య, వయస్సు 34 సం॥లు, హిందువు, వ్యవసాయం, డోర్ నెం.2-72, రావులాపురం గ్రామం, బొల్లాపల్లి మండలం, పల్నాడు జిల్లా. - జె.డి.ఆర్/ ప్రతివాది

పై నెంబరు అమలు పిటిషన్ నందు ఇందలి డి.హెచ్.ఆర్ వారు శ్రీ కోర్టు వారు ఇచ్చినటువంటి డిక్రీ ప్రకారం రావలసి నటువంటి సొమ్ము బాకీ వసూలు నిమిత్తం ఇందలి అమలు పిటిషన్‌లోని జె.డి.ఆర్‌కు చెందినటువంటి ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని జప్తు చేసి యున్నారు. ఆ విధంగా జప్తు చేయబడినటువంటి ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని శ్రీ కోర్టు వారి ఆర్డర్ మేరకు సదరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం **దీ.01.10.2023**న బహిరంగంగా పై తెలిపిన కోర్టు నందు **ఉదయం 10:30 ని॥లకు** వేలం నిర్వహించెదరు. సదరు వేలం పాటలో పాల్గొనదలచినవారు ఎవరైననూ పాల్గొనవచ్చును వేలం పాట యొక్క షరతులను ముందుగా పై తెలిపిన కోర్టు నందు అమీనా గారిని కలిసి తెలుసుకొనవలసినది **షెడ్యూలు :** పల్నాడు జిల్లా, నరసరావుపేట ఆర్.డి., వినుకొండ యస్.ఆర్.డి, బొల్లాపల్లి మండలంలోని రావులాపురం రెవిన్యూ గ్రామంలో గల డి.నెం. 175లోని య. 0-02ట్లలో నిర్మింతమైనటువంటి, 2-71డోర్ నెంబరు కలిగిన ఆర్.సి.సి దాబా ఇంటికి హద్దులు: **తూర్పు:** యలగాల పోలమ్మ రేకుల షెడ్డు **దక్షిణం :** యలగాల చిన్న బ్రహ్మయ్య ఆర్.సి.సి దాబా ఇల్లు, **పడమర:** సిమెంట్ రోడ్డు, **ఉత్తరం :** యలగాల చిన్న బ్రహ్మయ్య ఆర్.సి.సి దాబా ఇల్లు
అమీనా వాల్యు రూ. 7,00,000/-
మార్కెట్ వాల్యు రూ. 4,00,000/-

పి. సైదారావు, ఐ. నాగపద్మ
డి. హెచ్.ఆర్ తరపు న్యాయవాదులు,
వినుకొండ, సెల్ : **9440825595**
వేలం వేయు తేది: 01.10.2023

బాపట్లలో కదం తొక్కిన కార్మికులు

- ఎరుపెక్కిన పురవీధులు
- అట్టహాసంగా ప్రారంభమైన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు

భూమి, సామాజిక న్యాయం, ఉపాధి సాధన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన 22వ రాష్ట్ర మహాసభలు బాపట్లలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బాపట్ల పురవీధులు అరుణ పతాకాలు, తోరణాల ఏర్పాటుతో పట్టణం ఎరుపెక్కింది. పట్టణంలోని చీల్ రోడ్డు సెంటర్ నుంచి తవ్వకాలువ పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ రథం బజార్ మీదుగా రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న పింగళి వెంకయ్య విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభకు కూలి దండు మహాప్రదర్శన ఉత్సాహంతో సాగింది. ప్రజానాట్యమండలి డప్పు కళాకారులు వాయిద్య విన్యాసాలు ఉత్సాహం నింపాయి. సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, డీకేఎంయు జాతీయ ఉపాధ్యక్షులు రామమూర్తి సవికులను ఉద్దేశించి ప్రసంగించి ఉద్యమ స్ఫూర్తి నింపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల అవలంభిస్తున్న విధానాలను ఎండగట్టారు.

- విశాలాంధ్ర - బాపట్ల

(పూర్తి వివరాలు మెయిన్‌లో)

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

విద్యుత్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కె.జాన్ థామస్

విశాలాంధ్ర - చీరాల : చీరాల విద్యుత్ డివిజన్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కె.జాన్ థామస్ సోమవారం పదవి భాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయవాడ లోడ్ మానిటరింగ్ సెల్ ఈ.ఈగా పనిచేస్తూ బదిలీ మీద చీరాలకు వచ్చారు.గతంలో చీరాలలో పని చేస్తున్న కె.సూర్య ప్రకాష్ గుంటూరు విజిలెన్స్ ఈ.ఈ గా బదిలీ అయ్యారు.

ప్రైవేటు కార్యక్రమంలో ఎమ్మెల్యే సాంబశివరావు

విశాలాంధ్ర - యద్దనపూడి : పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మండలంలో వింజ నంపాడు గ్రామ తెలుగు యువత మాజీ మండల అధ్యక్షులు వజ్జా మహిందర్ తండ్రి మృతి చెందడం తో ఆయన దశదిన కర్మకు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం టిడిపి నాయకులతో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. టిడిపి నాయకులు మండల టిడిపి అధ్యక్షులు నల్లపనేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, రాయపాటి సీతయ్య, గుదే తారక రామారావు, వంశీకృష్ణ కోయ సతీష్ ఈరపనేని వాసు, వజ్జా సుబ్బరామయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

గులాబీ రంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : పత్తి పంటలో వచ్చు గులాబీ రంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి అని జిల్లా శిక్షణ సమన్వయ కర్త డి.డి.ఏ.ఎం విజయనిర్మల అన్నారు. మండలంలోని వింజనంపాడు గ్రామంలో పత్తి పొలాలను జిల్లా వనరుల కేంద్రం,ఏరువాక కేంద్రం బాపట్ల సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.సురేఖ దేవితో కలసి పరిశీలించారు. డి.డి.ఏ మాట్లాడుతూ ఆత్మ పథకం ద్వారా మాస్ ట్రాపింగ్‌లో భాగంగా ఎకరానికి 10 చొప్పున 10 ఎకరాలకు రైతులకు ఉచితంగా లింగాకార బుట్టలను అందజే స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి చల్లగుండ్ల ఆదినారాయణ పాల్గొన్నారు.

తీరప్రాంతాన్ని రక్షించండి

విశాలాంధ్ర - చీరాల : కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌కు విరుద్దంగా వ్యవహరిస్తున్న రిసార్ట్స్, రెస్టారెంట్స్ ఇతర వ్యాపార సంస్థల చట్ట వ్యతిరేక చర్యలను గుర్తించి వారిపై తగు చర్యలు చేపట్టి తీర ప్రాంతాల స్థిరమైన అభివృద్ధిని కాపాడాలని జర్నలిస్ట్ యన్.నాగార్జునరెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, వేటపాలెం, చిన్నగంజాం మండలాల పరిధిలో విచ్చలవిడిగా రిసార్ట్స్,రె ఒస్టారెంట్స్ ఇతర వ్యాపార సంస్థల నిర్మాణాలు ఇటీవల విపరీతంగా పెరుగుతున్నాయని, సముద్రపు అలల రేఖ(హెచ్.టి.ఎల్) నుండి 200 మీటర్ల పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు.

శాంతియుత నిరసనలపై వైసీపీ కేసులు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : టీడీపీ పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్మెంట్ ప్రాజె క్టులో అవినీతి చేశారని రిమాండు విధించి రాజమండ్రి జైలుకి తరలిం చటాన్ని నిరసిస్తూ తెదేపా చేస్తున్న శాంతియుత నిరసనలపై వైకాపా ప్రభుత్వం పోలీసు కేసులు నమోదు చేయిస్తుందని చీరాల నియోజకవర్గ తెదేపా ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు.పార్టీ నూతన కార్యాలయం వద్ద 13వ రోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు.ముస్లిం మైనారిటీ నాయకులు,మహిళలు దీక్షలో పాల్గొన్నారు. దువా ప్రార్థనలు నిర్వహించారు. పరిశీలకులు నాతాని ఉమా మహేశ్వర రావు,సయ్యద్ షరీఫ్, అబ్దుల్ అబిద్, ఎం.ఎం.బేగ్, షేక్ యాసిన్ పర్యవేక్షించారు.షేక్ కరిముల్లా,చిన్న కరిముల్లా, గౌస్, మొహిద్దిన్, సుభాని, అలీమ్, గౌస్ని, మున్నా, బాబు మున్వర్ బాషా, షైన్, మున్నా, సాహిద్, రబ్బాని, బాజీ, రఫీ మహిళలు సంఘీభావం తెలిపారు.

గిరిజనుల భూములను వారికే కేటాయించాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : గిరిజనులకు కేటాయించిన ప్రభుత్వ భూమిని ఆక్రమించిన దురాక్రమణదారులను తొలగించి పేదలైన ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని ప్రజావేదిక రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి ఏసురత్నం అన్నారు.తహసీల్దార్ కార్యాలయంలో పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలని ప్రజావేదిక ఆధ్వర్యంలో ఎంపీడీఓ నేతాజీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1971లో 72మంది గిరిజనులకు సర్వే నంబర్ 801 సాగుభూమి కేటాయించడం జరిగిందన్నారు. ఈ లేఅవుట్‌లోని 1వ నంబర్ నుంచి 37వ నంబర్స్ వరకు గిరిజనుల జీవనాధారం కొరకు సాగుభూమిని కేటాయించారన్నారు.మాజీ మునసబు గిరిజనులకు కేటాయించిన భూమిని దురాక్రమణ చేసి తన ఆధీనంలో ఉంచుకున్నారని తెలిపారు.అధికారులు స్పందించి విచారణ జరిపి పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో దండెయ్య కాలనీ ఎస్సిలు. ఎస్టీలు పాల్గొన్నారు.

వలంటీర్లకు ముఖాముఖి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలంలోని సచివాలయంల పరిధిలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించి, వారిలో అర్హులైన వారికి ముఖాముఖిలను ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపీడీఓ నేతాజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.ఈ ప్రక్రియను పూర్తి చేసి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఓఎ శ్రీనివాసరావు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామాల చెంతకే వైద్య సేవలు

విశాలాంధ్ర-అద్దంకి : విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామాలలోనే అనుభవజ్ఞులైన వైద్యుల చేత వైద్య సేవలు అందించడం జరుగుతుందని శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు.మండలంలోని జార్లపాలెం గ్రామంలో 20.80లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నూతనంగా నిర్మించిన వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం కృష్ణచైతన్య ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది,గ్రామ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అరెస్టులపై న్యాయ విచారణ జరిపించాలి - ఏఐటీయూసీ

విశాలాంధ్ర - రేపల్లె : అంగన్వాడీల అక్రమ అరెస్టులపై న్యాయ విచారణ జరిపించాలని ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు, సిపిఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పేర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి)ఆధ్వర్యంలో సోమవారం అంగన్వాడీ వర్కర్స్,హెల్పేర్స్, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు విజయవాడలో ధర్నాకు పిలుపునిస్తే వెళ్ళనీయకుండా ఎక్కడికి అక్కడ అరెస్టులు చేసి నిర్బంధాలకు గురిచేయటాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం రేపల్లె తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాగాంజనేయులు, బాలాజీలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి అంగన్వాడీలకు గ్రాడ్యూటి ఇవ్వాలని,62 సంవత్సరాలకు రిటైర్మెంట్ వయసును పెంచాలని, చివరి వేతనంలో 50 శాతం పెన్షన్ ఇవ్వాలని ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్ఫర్స్ అసోసియేషన్ నాయ కులు కనకదుర్గ, అరుణశ్రీ, నాగలక్ష్మి, బాజ్జి, నాంచారమ్మ, విజయ, కోటేశ్వరమ్మ, వేమూరు నియోజకవర్గం ఎఐటియుసి నాయకులు బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మేము సైతం బాబుతోనే' దీక్షలో గీత కార్మికులు

విశాలాంధ్ర - రేపల్లె : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా పార్టీ శ్రేణులు చేపట్టిన రిలే దీక్షలు 12వ రోజుకు చేరాయి.ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ ఆదేశాల మేరకు కల్లు గీత కార్మికులు దీక్షలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గీత కార్మికుల నాయకులు చెన్ను నాగమల్లేశ్వర రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షాల మనుగడను సహించలేకపోతున్నట్లుగా కనిపిస్తుందన్నారు. అణచివేత, కేసులు,ఎదురుదాడులు వంటి దుశ్చర్యలను ఆలంబనగా చేసుకుని ప్రతిపక్ష పార్టీల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలని చూడటం అవివేకమన్నారు. అధికార పార్టీ అక్రమ కేసులు, అణిచివేతలతో పోలీసు పాలన చేస్తుందని విమర్శించారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో అనూహ్యరీతిలో ప్రజలు మద్దత్తు తెలుపుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ నియంతృత్వ పాలనకు ప్రజలు చమగీతం పాడతారని హెచ్చరించారు.ఈ మేరకు, మేము సైతం బాబు తోనే, టీడీపీతోనే రాష్ట్ర భవిషత్ , సైకో పోవాలి సైకిల్ రావాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీక్షలో పాల్గొన్న టీడీపీ లీగల్ సెల్ నాయకులు వై.ధర్మ తేజ,వెనిగళ్ళ సుబ్రమణ్యం,నాగమల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులు మెలకువలు పాటించాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : అక్వా రంగ రైతులు మెలకువలు పాటించి ఉత్తమ దిగుబడులు సాధించాలని, పర్యావరణ హితముగా ఆక్వా ఉత్పత్తులను పెంపొందించుకోవాలని నిజాంపట్నం మత్స్యశాఖ ఏడీఎఫ్ బి.సైదా, ఎఫ్డీఓ పి.సాయి సందీప్ తెలిపారు. సోమవారం నిజాంపట్నంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో ఆర్టిడ్స్ సంస్థ తెనాలి, ఎస్ఎఎంఏవైయు న్యూ ఢిల్లీ సంస్థల సంయుక్తంగా నిజాంపట్నం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆక్వా రంగం గురించి ఆక్వా రైతులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆరోగ్యకరమైన మానవ జంతు జీవితాలను నిర్ధారించడానికి ఆక్వాకల్చర్ వ్యవసాయంలో మరింత స్థిరత్వము, పర్యావరణ అనుకూల విధానాన్ని తీసుకురావడానికి ప్రభుత్వంతో చర్చించడానికి ఆక్వా రైతుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోటు ఓనర్స్ యూనియన్ ప్రెసిడెంట్ మోపిదేవి శ్రీనివాసరావు,ఆర్టిడ్స్ సంస్థ ప్రతినిధులు రవి శంకర్, మగ్రు సాంబశివరావు, గ్రామ మత్స్య సహాయకులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి తూట్లు

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పక్కదారి పట్టిందని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ అన్నారు.ఇసుక మాఫియాపై జనసేన జిల్లా నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని శనివారం రాత్రి నుండి నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులను కార్యకర్తలను ఎక్కడికక్కడ నిర్బంధించి పోలీసుస్టేషన్‌లకు తరలించారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికలే లక్ష్యంగా అధికార, ఒక పథకం ప్రకారం ప్రతిపక్ష పార్టీలను అణిచి వేసేందుకు ప్రణాళికలు రూపొందించు కుందని ఆరోపించారు. అధికార పార్టీ రాక్షసత్వంగా వ్యవహరిస్తూ జనసేనపార్టీ నాయకులను శనివారం రాత్రి అరెస్టు చేసి, సోమవారం ఉదయం వరకూ వదలక పోవడం దారుణం మన్నారు.

చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత చిట్యాల ఐలమ్మ 128వ జయంతి సందర్భంగా సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ స్పందన కార్యక్రమములో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకి మహిళా రిజర్వేషన్లలో బీసీ సబ్ కోట అమలు పరచవలసిన కారణాలను సందర్భానుసారంగా వివరిస్తూ వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు. మేధ శ్రీనివాసరావు మాట్లాడుతూ రిజర్వేషన్లు ప్రవేశపెట్టడానికి ప్రధాన కారణం వెనుకబడిన తరగతులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దడానికి, రాష్ట్రము కేంద్రంలోని సేవలు అన్ని కులాలు చెందిన వ్యక్తులకు సమాన ప్రాతినిధ్యం ఉండేటట్టు చూడటం వెనుకబడిన తరగతులను ప్రోత్సహించడం అభివృద్ధి చేయటం కోసం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు ప్రముఖ న్యాయవాది అంగలకుదురు నటరాజన్,గౌడ సంఘం నాయకులు మోర్ల చిన్న వెంకటేశ్వరరావు,జిల్లా నాయి బ్రాహ్మణ సంఘ కార్యదర్శి చీమకుర్తి కృష్ణ చైతన్య, యాదవ సంఘం నాయకులు దర్శి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం కోసం కష్టపడడమే చంద్రబాబు తప్పా !

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర - మార్టూరు : నిలువ నీడలేని ఆంధ్రప్రదేశ్ కోసం అహొరాత్రులు శ్రమించి,రాష్ట్రానికి దిశా దశ చూపి ఆంధ్రప్రదేశ్ను అగ్రగామిగా నిలపడం, రాష్ట్రం కోసం కోసం అహర్నిశలు శ్రమించడమే చంద్రబాబు చేసిన తప్పా అని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం మార్టూరు పర్చూరు మండలాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. పలు కుటుంబాలను పరామర్శించిన ఆయన ధైర్యం కల్పించారు. ఇటీవల మృతి చెందిన పలువురి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో టీడీపీ పార్టీ అధినేత చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కుట్రలతో అక్రమ కేసులో ఇరికించారని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన మహా నాయకుడిని రాజకీయంగా ఎదుర్కోలేక కుట్ర పన్ని అధికారాన్ని అడ్డం పెట్టుకొని కేసు నమోదు చేశారన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ అని ప్రపంచం మొత్తం తేలిపోయిందన్నారు.చంద్రబాబుకు రాష్ట్రంలో మొదలైన మద్దతు రాష్ట్రాలు దాటి ఎల్లలు దాటి ప్రపంచం మొత్తం పాకిందన్నారు. చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ఓటు అనే వజ్రాయుధం ద్వారా ప్రజలం దరూ బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ప్రజలం దరినీ కార్యకర్తలు నాయకులు చైతన్యం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలు అరాచక ప్రభుత్వంపై పోరాడేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అరాచక అక్రమ దౌర్జన్యాలకు పాల్పడుతున్న వైసీపీ వచ్చే ఎన్నికల్లో ఖాళీ కావడం ఖాయం అన్నారు.

ప్రభుత్వ అక్రమాలను ప్రజలకు వివరించాలి

విశాలాంధ్ర - వేమూరు : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాల్సిన ఆవశ్యకత ఉందని మాజీ మంత్రి టీడీపీ పోలీట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు తెలియజేశారు. చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం పార్టీ కార్యాలయంలో నిరసన దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం నిరసన దీక్షను కొనసాగిస్తూనే చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును,జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ అవినీతిని, అనాలోచిత పాలన విధానాలను, ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ విధానాలపై ప్రజలు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారని పార్టీ శ్రేణులు, వీటిని ప్రజలకు మరింత చెరువ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం,ప్రతిపక్ష పార్టీలను ప్రజలను కూడా భయభ్రాంతులకు గురి చేస్తుందని, రాష్ట్ర ప్రజలు కూడా ఈ విధానాలకు పూర్తిగా విసుగెత్తి తిరగబడే సమయం ఆసన్నమైందని గుర్తు చేశారు.ఈ పోరాటం ఎన్నికల వరకు కొనసాగించాలని పార్టీ నాయకులకు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే ముమ్మినేని వెంకటసుబ్బయ్య, జొన్నలగడ్డ విజయబాబు, దండే సుబ్బారావు, తుమ్మల శ్రీధర్, ఎల్లారెడ్డి, మైనేని మురళీకృష్ణ, మన్నే పసి, శేషు బాబు పాల్గొన్నారు.